సంక్షేమ పథకాల అమలు బాధ్యత వార్డు అధికారులదే

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల సంక్షేమ పథకాల అమలు బాధ్యత వార్డు అధికారులదేనని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం రాగన్నగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కొంత మంది అధికారులు గైర్హాజరు కావడం పట్ల ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమైన విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ, సివిల్ సప్లై, హౌసింగ్ అధికారులు సమావేశానికి రాకపోవడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఎమ్మెల్యే కింది స్థాయి అధికారుల ద్వారా ఫోన్ చేయించి పిలిపించారు. అభివృద్ధి పనులపై వార్డుల వారీగా రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫోన్‌లకు స్పందించాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలను తీర్చాలని ఆదేశించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని అన్నారు. పాత గ్రామాలలో అభివృద్ధిని విస్మరిస్తున్నారని పలువురు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారెంటీలు ప్రజలకు చేరాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే అందుకు అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఇందిరమ్మ కమిటీలను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి కొరత రాకుండా చూసుకోవాలని హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులను కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి సంక్షేమ పథకం పేదవాడి ఇంటికి చేరాలని అన్నారు. కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజలు హాజరయ్యారు.


కాలనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్

చంపాపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌లోని దుర్గాభవానీనగర్‌కాలనీలో గురువారం కార్పొరేటర్ ఆయా శాఖల అధికారులతో కలిసి పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో మిగిలిపోయిన ఆయా రోడ్లను సీసీ రోడ్లుగా నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కాలనీలో చెత్తకుప్పలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని శానిటేషన్ సిబ్బందిని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ గోపాలకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, జలమండలి మేనేజర్ రమ్యభారతి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఇబ్రహీం, షబ్బీర్, శ్రీనివాస్, నర్సింహ, కాలనీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిషికాంత్‌రెడ్డి, కోశాధికారి నాగేశ్వర్‌రావు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ జెండా ఎగురవేస్తాం

సైదాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ జెండా ఎగురవేస్తామని బీజేపీ అభ్యర్థి డాక్టర్ ఎన్.గౌతంరావు ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డిని కలిశారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్‌ను గెలిపించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీకి దూరంగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ శంకర్‌యాదవ్, నియోజకవర్గ కన్వీనర్ బండ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తోట అమర్నాథ్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, నాయకులు మన్నె శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

జై భీమ్ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ


జైభీమ్ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్ : అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 14న అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్ వద్ద గల 125 అడుగుల విగ్రహం వరకు జై భీమ్ ర్యాలీని నిర్వహించనున్నారు. నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నక్క మహేష్‌మాదిగ, నాయకులు గుర్రం కోటేష్ మాదిగ, మేడి ప్రసాద్, కొత్తపల్లి అన్వేష్‌మాదిగ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని జయప్రదం చేయాలి

చంపాపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి, జ్యోతిరావుఫూలే మహనీయుల జయంతి వేడుకలను జయప్రదం చేయాలని రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని నందనవనంలో గురువారం భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రామస్వామి అధ్యక్షతన జరిగిన జనరల్‌బాడీ సమావేశానికి చంద్రమోహన్ హాజరై మాట్లాడుతూ ఈనెల 14న ఫూలే, అంబేడ్కర్ జయంతులను విజయవంతం చేయాలని కోరారు. దళితులు, గిరిజనులు, మహిళలు నేటికీ కుల వివక్షకు గురవుతున్నారని అన్నారు. మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఆలేటి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు


రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ ఎన్నికలు తుది ఘట్టానికి చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా కోర్టుల ఆవరణలో పోలింగ్ జరుగనుంది. వారం రోజుల పాటు పోటాపోటీగా ప్రచారం చేసుకున్న అభ్యర్థులు చివరి ప్రయత్నంగా ఒకొక్కరితో మాట్లాడి తమకు మద్దతు నివ్వాలని విజ్ఞప్తి చేసుకుంటున్నారు. ఓటరు జాబితాలో ఉన్న ప్రతి న్యాయవాది శుక్రవారం జరుగనున్న పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారి దీకొండ రవీందర్ తెలిపారు.

హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయండి

కొత్తపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మోహన్‌నగర్ నుంచి హనుమాన్ యువసేన ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహిస్తున్న హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని అధ్యక్షుడు బోల్గం యశ్పాల్‌గౌడ్ కోరారు. గురువారం మోహన్‌నగర్ కార్యాలయంలో శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాజీనగర్‌లో 12న సాయంత్రం 5గంటలకు అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అనంతరం 6గంటల నుండి హనుమాన్ శోభాయాత్ర ప్రాంభమవుతుందని పేర్కొన్నారు. 13 సంవత్సరాలుగా యువసేన ఆధ్వర్యంలో శోభాయాత్ర కార్యక్రమం జరుగుతోందన్నారు. మోహన్‌నగర్ చౌరస్తా మీదుగా కొత్తపేట మారుతీనగర్, జైన్‌మందిర్ తదితర ప్రాంతాల గుండా యాత్ర చైతన్యపురి రామాలయం వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు కిరణ్‌కుమార్, వినోద్‌కుమార్, వెంకటేష్, సంప్రీత్, విష్ణు, భావన్, వరుణ్ పాల్గొన్నారు.

చంపాపేట : చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం నుంచి ఈనెల 12న ఉదయం కోటీ మీదుగా తాడ్‌బండ్ వీర హనుమన్ ఆలయం వరకు 27కిలోమీటర్ల పొడవున కొనసాగనున్న వీర హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ కోరారు. కర్మన్‌ఘాట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర వ్యాప్తంగా ఉన్న అన్ని ఆధ్యాత్మిక ధార్మిక సంస్థల ప్రతినిధులు లక్షలాదిగా శోభాయాత్రలో పాల్గొననున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాటు చేస్తున్నట్లు, శోభాయాత్ర సాగే ప్రాంతాలలో జీహెచ్ఎంసీ, ప్రభుత్వ యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని శశిధర్ కోరారు. కార్యక్రమంలో విహెచ్‌పి వివేకానంద జిల్లా అధ్యక్షుడు తూము పురుషోత్తంరెడ్డి, జిల్లా కార్యదర్శి పులిమద్ది సుధాకర్, బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ నవారు రాజేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కేసని గణేష్, మీడియా ఇన్‌చార్జి ఎస్.బ్రహ్మచారి, నేతలు ఉప్పల సంజయ్‌శర్మ, శ్రీశైలం, గురువయ్య, రాములుగౌడ్ పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కార్పొరేటర్ సుజాతానాయక్

చంపాపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ విరాట్‌నగర్‌కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్ వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

చాదర్‌ఘాట్ : ఆర్టీసీ హైదరాబాద్-2 డిపో నుంచి రాష్ట్ర నలుమూలలకు, అంతర్ రాష్ట్రాలకు నడిచే సూపర్ లగ్జరీ, ఏసీ, నాన్ ఏసీ, డీలక్స్, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల ద్వారా ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించేందుకు అవసరమైన ఫిర్యాదులు, సలహాలు, సూచనలు పొందేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ప్రయాణికులు శుక్రవారం మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంట వరకు 9959226249 ద్వారా సంప్రదించవచ్చని ఆయన విజ్ఞప్తి చేశారు.

కలుషిత తాగునీటి నివారణకు పైప్‌లైన్ నిర్మాణం

● మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆజంపుర డివిజన్‌లోని సీ క్లాస్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న కుటుంబాలకు సరఫరా అవుతున్న కలుషిత తాగునీటి నివారణకు నూతన పైప్‌లైన్ నిర్మించాలని నిర్ణయించినట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. గురువారం ఆయన ఆజంపుర డివిజన్‌లోని సీ క్లాస్ క్వార్టర్స్‌లో జలమండలి డీజీఎం సందీప్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ మహేష్, జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఈఈ పీర్‌సింగ్, ఏఈ మల్లికార్జున్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ అహ్మద్, చాదర్‌ఘాట్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ ప్రసాద్, మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్‌తో కూడిన బృందంతో పర్యటించారు. సీ క్లాస్ క్వార్టర్స్‌లో 25ఏళ్ల క్రితం నిర్మించిన కాస్ట్ ఐరన్ పైప్‌లో క్లోరిన్ పేరుకుపోయి తాగునీరు సరఫరా అయినప్పుడల్లా వివిధ రంగుల్లో నల్లాలకు నీరు సరఫరా అవుతుందని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. 25ఏళ్ల క్రితం నిర్మించిన పైప్‌లైన్ కారణంగానే తాగునీరు కలుషితమవుతున్నట్లుగా జలమండలి అధికారులు నిర్ధారించడంతో దాని స్థానంలో కొత్తగా సిమెంట్ కోటింగ్‌తో కూడిన పైప్‌లైన్‌ను నిర్మించాలని ఆయన జలమండలి అధికారులకు సూచించారు. 280 మీటర్లతో 100 ఎంఎం డయా నూతన పైప్‌లైన్ నిర్మించేందుకు ప్రతిపాదించారు. ఇందుకు గాను రూ.20లక్షల వరకు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఈ నెలాఖరులోగా నూతన తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పైప్‌లైన్ కోసం రోడ్ల తవ్వకాలు పూర్తికాగానే నూతన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలను తయారు చేయాలని ఆయన ఏఈ మల్లికార్జున్‌కు తెలిపారు. అధునాతనంగా తీర్చిదిద్దిన ఆజంపుర క్లాక్ టవర్ చౌరస్తాలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ఆయన మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్‌కు తెలిపారు.


కలుషిత నీటి సరఫరాకు కారణాలను జలమండలి అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బలాల

మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి

● గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి
● పాలకవర్గంతో కలిసి మామిడి క్రయ విక్రయాల పరిశీలన

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కు వచ్చే మామిడి రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు అధికారులు చొరవ చూపాలని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి కోరారు. రైతు ప్రయోజనాలే ముఖ్యం అన్నారు. మామిడి సీజన్ ఊపందుకున్న నేపథ్యంలో పాలకవర్గంతో కలిసి గురువారం చైర్మన్ మధుసూదన్‌రెడ్డి మార్కెట్‌లో కలియతిరిగి మామిడి క్రయ, విక్రయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, వ్యాపారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తెలిపిన పలు సలహాలు, సూచనలను స్వీకరించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ సీజన్‌లో మార్కెట్‌కు అధికంగా మామిడి దిగుబడి వస్తోందన్నారు. అందుకు అనుగుణంగా మార్కెట్ యార్డులో అన్ని రకాల సౌకర్యాలు కల్పించామన్నారు. రైతు ప్రయోజనాలే ముఖ్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ప్రతి రోజు సుమారు 800 వాహనాల్లో మార్కెట్‌కు పండ్లు వస్తున్నాయని, ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, మార్కెట్ సెక్రెటరీ ఎల్. శ్రీనివాస్, డైరెక్టర్లు మధుసూదన్‌రావు, అంజయ్య, వనరాజ్, గణేష్‌నాయక్, రఘుపతిరెడ్డి, లక్ష్మి, గోవర్ధన్‌రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, నర్సింహ, ఇబ్రహీం, మార్కెట్ అధికారులు హర్ష, విజయ్, మురళీ, శ్రీను, శ్రీశైలం పాల్గొన్నారు.


మార్కెట్‌లోకి వచ్చిన మామిడి కాయలను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు

మదర్ డెయిరీ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రతిపక్ష పార్టీల కుట్ర

● ఖండించిన తొమ్మిది మంది పాలకవర్గం సభ్యులు

హయత్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీని అప్రతిష్ట పాలు చేయడానికి ప్రతిపక్ష పార్టీలు మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డిపై అవిశ్వాసం పెడుతున్నట్లు వస్తున్న వార్తలను చైర్మన్‌తో పాటు ఎనిమిది మంది డైరెక్టర్లు తీవ్రంగా ఖండించారు. గురువారం హయత్‌నగర్‌లోని మదర్‌డెయిరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, తొమ్మిది మంది డైరెక్టర్లు మాట్లాడారు. చైర్మన్‌పై అవిశ్వాసం అనే మాట బూటకం అన్నారు. కొంత మంది ఏదో రకంగా డెయిరీని ఇబ్బందులకు గురి చేసి పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నష్టాల్లో ఉన్న డెయిరీని గట్టెక్కించడానికి తామంతా కృషి చేస్తుంటే ఓర్చుకోలేక కావాలని అవిశ్వాసం పెడుతున్నట్లు లీకులు ఇస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు అంతా ఒకే తాటిపై ఉన్నామని స్పష్టం చేశారు. డెయిరీ అభివృద్ధిపై చర్చించడానికి త్వరలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవనున్నట్లు వారు తెలిపారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా పాడి రైతులను, ఉద్యోగులను డెయిరీని కాపాడుకుంటామని అన్నారు. పాలకవర్గం తీర్మానాల మేరకే తామంత కలిసి నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటికే రైతులకు కొన్ని బిల్లులు చెల్లించడం జరిగింది. త్వరలో మిగిలిన బిల్లులు కూడా చెల్లించడం జరుగుతుందని అన్నారు. ఆస్తులను అమ్మడం కొంత ఆలస్యం జరుగుతుందని అంత వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహాయాన్ని అర్థిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డైరెక్టర్లు మందడి ప్రభాకర్‌రెడ్డి, గొల్లెపల్లి రాంరెడ్డి, కళ్లెపల్లి శ్రీశైలం, కర్నాటి జయశ్రీ ఉప్పల్‌రెడ్డి, ఆగ్రాల నర్సింహారెడ్డి, మండలి జంగయ్య, గూడురు శ్రీధర్‌రెడ్డి, పుప్పాల నర్సింహులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్‌కు చెందిన పాలకవర్గం సభ్యులు

కేంద్ర ప్రభుత్వానివి ఏకపక్ష నిర్ణయాలు : సీపీఐ

సరూర్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాల, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలతో ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి విమర్శించారు. కేంద్రం ఇటీవల తీసుకున్న పలు నిర్ణయాలకు వ్యతిరేకంగా గురువారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ చౌరస్తాలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చారి మాట్లాడుతూ 370 ఆర్టికల్ రద్దు, వక్ఫ్ చట్టానికి సవరణలు, ట్రిపుల్ తలాక్ వంటి నిర్ణయాలు ముస్లిం మైనారిటీల మనోభావాలను పూర్తిగా దెబ్బతీశాయని, వారిలో అభద్రతా భావం నెలకొన్నదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ బాలాపూర్ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, లెనిన్‌నగర్ శాఖ కార్యదర్శి పిచ్చి రాజు, గిరిజన సమాఖ్య కార్యదర్శి చిత్రానాయక్, భారత జాతీయ మహిళా కార్యదర్శి బండ యాదమ్మ, రైతు సంఘం నాయకుడు జాజర్ల అంజయ్య, శేఖర్‌యాదవ్, బాబు, నర్సింహ, కృష్ణ, సీతమ్మ, పార్వతి, సబిత, జ్యోతి, నరసమ్మ, జంగమ్మ పాల్గొన్నారు.

సామ బాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

● మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి

చంపాపేట, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): చంపాపేట సర్పంచ్‌గా 28 సంవత్సరాలుగా సేవలందించిన సామ బాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం అని మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి అన్నారు. సామ బాల్‌రెడ్డి 24వ వర్ధంతిని పురస్కరించుకొని చంపాపేటలోని సామ బాల్‌రెడ్డి విగ్రహానికి గురువారం బాల్‌రెడ్డి కుమారుడు సామ రమణారెడ్డి, మనుమడ్లు సామ గౌతంరెడ్డి, సామ వంశీధర్‌రెడ్డి ఆయా పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సామ బాల్‌రెడ్డి సర్పంచ్‌గా, భాగ్యనగర్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా 40 సంవత్సరాల పాటు ఈ ప్రాంత ప్రజలకు సేవలు అందించినట్లు రమణారెడ్డి పేర్కొన్నారు. చంపాపేట ఎల్బీనగర్ మున్సిపాలిటీలో విలీనం అయ్యే వరకు ఓటమి ఎరగని నేతగా కీర్తి గడించారని అన్నారు. కార్యక్రమంలో నేతాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు బైగళ్ల రవీందర్, ఈశ్వర్, మంత్రి జగన్, నాయకులు మెట్టు సంజీవరెడ్డి, ముత్యాల సత్యనారాయణ, కట్టా వెంకటేష్, గంగబాబు, శంకర్, లక్ష్మయ్య, పెంటయ్యగౌడ్, అన్నుకుమార్, అంజయ్య పాల్గొన్నారు.


బాల్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రమణారెడ్డి

పేదలకు అన్నదానం

సామ బాల్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని చంపాపేటలోని విద్యాబోధిని స్కూల్ ఆవరణలో గురువారం ఆయన మనుమండ్లు సామ గౌతంరెడ్డి, సామ వంశీధర్‌రెడ్డి 500మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సామ సురేందర్‌రెడ్డి, అబ్దుల్ ఖాదర్, సారయ్య, హన్సేన్, నాగరాజు, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

అత్యాధునిక చికిత్సతో 'పార్కిన్సన్స్'ను నయం చేయొచ్చు

● కామినేని ఆస్పత్రి న్యూరోసర్జన్ డాక్టర్ ఎస్.రమేష్

మన్సూరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చేతులు, కాళ్లు వణుకుతూ మన శరీరంపై మనకే నియంత్రణ లేకుండా చేసే ప్రమాదకర వ్యాధి పార్కిన్సన్స్ అని, ఈ వ్యాధిని అత్యాధునిక చికిత్స, మందులతో నయం చేయొచ్చని కామినేని ఆస్పత్రి సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ ఎస్.రమేష్ పేర్కొన్నారు. నేడు(శుక్రవారం) ప్రపంచ పార్కిన్సన్స్ డేను పురస్కరించుకుని ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రి ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ సాధారణంగా 60ఏళ్లు పైబడిన వారిలో కనబడే ఈ వ్యాధి ప్రస్తుత సమాజంలో 20ఏళ్లు దాటిన వారిలోనూ కనిపిస్తోందన్నారు. పార్కిన్సన్స్ మెదడుకు సంబంధించిన వ్యాధి అని, ఈ వ్యాధి సోకిన వారిలో మలబద్ధకం, చేతులు, కాళ్లు వణకడం, మలుపులు తిరిగేప్పుడు పడిపోతామన్నట్లు భావించడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా సమీపంలోని వైద్యులను సంప్రదించి వారి సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటిస్తే వ్యాధిని తరిమికొట్టవచ్చన్నారు. సమావేశంలో కామినేని వైద్యులు కమలేష్ డి చౌద, ఎం.లక్ష్మీలావణ్య, నర్రెడ్డి సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కామినేని ఆస్పత్రి వైద్యులు


భద్రత ఏర్పాట్లపై పరిశీలిస్తున్న ఏసీపీ శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్ నరేష్

హనుమాన్ శోభాయాత్రకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వీర హనుమాన్ విజయ శోభాయాత్ర మలక్‌పేట మీదుగా కొనసాగనుండడంతో ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపారు. గురువారం మలక్‌పేటలో వీర హనుమాన్ విజయ శోభాయాత్ర సాగే రూట్‌ను మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం వీర హనుమాన్ విజయోత్సవం సందర్భంగా కర్మాన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమయ్యే వీర హనుమాన్ విజయ శోభాయాత్ర మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్ నుంచి మలక్‌పేట సూపర్ బజార్ మీదుగా సాగనున్నందున అడుగడుగునా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. 150 మంది పోలీసు సిబ్బందితో భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా 10 పోలీస్ పికెట్లను ఏర్పాటు చేశారు. ఏడు సమస్యాత్మకమైన ప్రాంతాలను, మూడు అతి సున్నితమైన ప్రాంతాలను గుర్తించి సాయుధ పోలీసులతో పికెట్లను ఏర్పాటు చేశామన్నారు.

రక్తదానం చేయండి.. ప్రాణాలు కాపాడండి

వనస్థలిపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయండి.. విలువైన ప్రాణాలు కాపాడాలని హైదరాబాద్ సీసీఎస్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ గాదరి మనోహర్ అన్నారు. మహాత్మాజ్యోతిరావుఫూలే జయంతిని పురస్కరించుకుని మదర్‌థెరిస్సా చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు చేపూరి శంకర్ ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సెల్ఫ్ ఫైనాన్స్‌కాలనీ సంక్షేమ సంఘం భవనంలో గురువారం తలసేమియా రోగుల సహాయార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మనోహర్ మాట్లాడుతూ గర్భిణులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు, తలసేమియా రోగులు, రోడ్డు ప్రమాదాలకు గురైనవారు, క్యాన్సర్ రోగులు ఇతర వ్యాధిగ్రస్తులకు సకాలంలో రక్తం దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారి కోసం ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి విలువైన ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు. అనంతరం రక్తదానం చేసిన వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిట్టు కృష్ణ కురుమ, సతీష్‌కుమార్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్ సంజయ్‌కుమార్, సునీత, యోగిత పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ స్పందన

'బడ్డి బెంచ్'తో విద్యార్థుల్లో ఒంటరితనం దూరం

సరూర్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ విద్యార్థుల్లో ఒంటరితనం అనే రుగ్మత పెరిగిపోతున్నదని, దానిని పోగొట్టడానికిగాను 'బడ్డి బెంచ్' సిస్టమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ స్పందన పేర్కొన్నారు. పరీక్షలకు ముందు, పరీక్షల ఫలితాలకు ముందు విద్యార్థులు ఆత్మస్థైర్యం కోల్పోతుంటారని, అలాంటి వారి పక్కన మరొకరు కూర్చుని వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి ప్రయత్నించడమే బడ్డి బెంచ్ అని ఆమె అన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్‌లో గల శ్రీభారతి విద్యాలయ స్కూల్‌లో గురువారం బడ్డి బెంచ్‌పై అవగాహన కల్పించే నిమిత్తం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ స్పందన పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారిలో ఒంటరితనాన్ని దూరం చేయడానికి బడ్డి బెంచ్ చక్కగా ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమం చేపడితే విద్యార్థి దశలో జరుగుతున్న ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేయవచ్చునని ఆమె వ్యాఖ్యానించారు. ప్రిన్సిపాల్ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చడంలో చలివేంద్రాలు దోహదం

మన్సూరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో ప్రజలు, పాదచారుల దాహార్తిని తీర్చడంలో చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఆటోనగర్‌లో ది హైదరాబాద్ ఆటోనగర్ మెకానికల్ అండ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొండా కృష్ణ, జగన్, రవికుమార్, సత్యనారాయణ, బాలకృష్ణ, బాబా, బీజేపీ నేతలు శ్రీధర్‌గౌడ్, కిరణ్ పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో బార్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం


దరఖాస్తు స్వీకరిస్తున్న జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి

ఎల్బీనగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో మూతపడిన బార్ అండ్ రెస్టారెంట్ స్థానంలో కొత్తగా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయడానికి ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సరూర్‌నగర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల వారు ఈనెల 26 వరకు అన్ని కార్యాలయ పనిదినములలో దరఖాస్తుతో పాటు రూ.లక్ష చలాను/డీడీని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, సరూర్‌నగర్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఇతర వివరాల కోసం సరూర్‌నగర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి : సీపీఎం

హయత్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నర్సింహ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధరలను అడ్డగోలుగా పెంచి సామాన్యుల నడ్డి విరిచిందని అన్నారు. పెంట్రోలియం ఉత్పత్తులను పెంచడం వల్ల నిత్యవసర వస్తువుల ధరలు పెరిగాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదల కోసం చేసింది ఏమి లేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలన్నారు. కార్యక్రమంలో స్వరూప, అలివేలు, రాజ్యలక్ష్మితో పాటు పలువురు పాల్గొన్నారు.